# వానప్రస్థం

-కె.వాసవదత్త రమణ

"అమ్మా...అమ్మా... ఏం చేస్తున్నావే?" రవి విసుగ్గా అన్నాడు హర్షకి స్కూల్ డ్రెస్ వేస్తూ.

"వస్తున్నానురా రవి. నాన్నగారికి కాఫీ ఇచ్చి పక్కబట్టలు సర్ది వస్తున్నానురా" వరలక్ష్మి కొంగు దోపుకుంటూ గదిలోంచి బయటకు వచ్చింది.

"అమ్మా! హర్షకి స్కూలు బస్సు వచ్చే టైమైంది. కాస్త అన్నం కలిపేసి వాడి బుట్ట సర్దేయి. నేనీలోగా బట్టలు వేసుకుని వస్తాను" రవి చిరాకుపడుతూ బెడ్రూమ్‌లోకి వెళ్లాడు.

కొడుకు చిరాకుకు వరలక్ష్మి మనస్సు నొచ్చుకుంది. అయినా తమాయించుకుని వంటింట్లోకి వెళ్లింది. అక్కడ భారతి స్నానానికి వేడినీళ్ళు బక్కెట్లో వంపుకుంటోంది.

"భారతీ! వాడికి బాక్సులోకి కూర కలపనా, పప్పు పెట్టనా?" కోడల్ని నెమ్మదిగా అడిగింది.

"అబ్బ...అత్తయ్యా...ఏదో ఒకటి పెట్టేయండి. ఇవాళ్లంతా హడావుడే. పనే తెమలడంలేదు" హడావుడిగా బాత్రూమ్‌లోకి పరుగెత్తింది భారతి.

హర్ష తల దువ్వి పౌడరు రాసి తయారుచేసి వాడి స్కూలు బ్యాగు, బుట్ట తీసుకుని వీధిగుమ్మం ముందు పెట్టింది వరలక్ష్మి.

"వరం! ఒక్కసారిరా. నా పెన్షన్ ఫైలు ఏదీ కనబడడంలేదు" లోపల్నుంచి రంగారావు కేక పెట్టాడు.

వరలక్ష్మి ఏదో అనబోయింది.

"వెళ్లమ్మా వెళ్ళు. ముందు నాన్నగారి పని చూడు. పొద్దునే ఫైలు కావాలి ఆయనకి" రవి కోపంగా అని హర్షని సందు చివర బస్సెక్కించడానికి తీసుకెళ్లాడు.

వరలక్ష్మి చిన్నగా నిట్టూర్చి లోపలకు నడిచింది.

"ఏవండీ! ఎందుకా తొందర, ఆ గావుకేకలు? ఆ ఫైలేదో మధ్యాహ్నం తీరిగ్గా చూసుకోవచ్చుగా?"

కొడుకు, కోడలు తనమీద ప్రదర్శించిన విసుగు, కోపం ఆవిడ భర్తమీద ప్రదర్శించింది.

మంచంమీద కూర్చున్న రంగారావు ముందుకు వంగి కళ్లజోడు సరి చేసుకుని భార్య వంక పరిశీలనగా చూసి పరిహాసంగా నవ్వాడు.

"భేష్! కాపురం చేసిన ఇన్నాళ్లకు నీలో ఇంత కోపం, విసుగు చూసాను వరం" చుర్రుమంది ఆవిడకి.

"చాల్లెండి పొద్దునే మీ జోకులు. ఆ... ఇదిగో ఫైలు బీరువాలో ఎదురుగా భద్రంగా ఉంది సరేనా. పెద్ద పనున్నట్లు పిలుస్తారు" అంటూ చేతులు తిప్పుతూ బిగ్గరగా అంది.

ఆయన నవ్వుతూ ఏదో అనేంతలో "అత్తయ్యా" భారతి పిలుపు వినబడింది.

"ఆ..ఆ.. వస్తున్నాను" అంటూ ఆయన వంక చూస్తూ బయటకు వచ్చింది.

రంగారావు వరలక్ష్మి వెళ్లినవైపే సాలోచనగా చూస్తుండిపోయాడు.

"అత్తయ్యా! పూజ ఇప్పుడే లేచింది. ఇదిగో ఈ పాలు కాస్త పట్టించండి. నేనీలోపు వేడినీళ్ళు పడేసి టిఫిన్ బాక్సులు రెడీ చేస్తాను" భారతి చీరపిన్ను సవరించుకుంటూ వచ్చి పూజని అందించింది.

మనవరాలిని ఒళ్లో వేసుకుని పాలు త్రాగించింది వరలక్ష్మి.

పిల్లాడ్ని దింపేసి వచ్చిన రవి గబగబా బ్రీఫ్ కేసు సర్దుకుని "భారతీ! రెడీనా టైమైపోతోంది" వంటింట్లోకి చూస్తూ డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చుని అరిచాడు.

"అబ్బా..రెడీగానే ఉన్నాను. కాస్త ఈ టిఫిన్ తినండి ముందు" అంటూ భారతి ఉప్మా ప్లేటు అతనికిచ్చి తనొకటి తీసుకుంది.

"అత్తయ్యా! వెళ్లొస్తాము. పూజ ఇవాళ లేటుగా లేచింది. నీళ్లు కాగే ఉన్నాయి కదా కాస్త స్నానం చేయించేయండి" పూజని గట్టిగా ముద్దు పెట్టుకుంటూ అంది భారతి.

వాళ్లు ఆఫీసుకు వెళ్లగానే పూజను చంకలో ఇరికించుకుని టిఫిన్ అందించింది రంగారావుకి.

"అబ్బా...ఇంత చల్లగానా వరం! నీకు తెలుసుగా నాకు ఉప్మా వేడిగా ఉండాలని" రంగారావు ఉప్మా నోట్లో పెట్టుకుని అన్నాడు.

ఆవిడ కళ్లల్లో నీళ్ళు తిరిగాయి. అలసటగా గుమ్మానికి జారగిలబడింది.

ఆవిడ ముఖం చూసి నొచ్చుకున్నాడు రంగారావు తనిలా అని ఉండాల్సింది కాదని.

వంటింట్లోకి వెళ్లి మూకుడులోంచి ఉప్మా ఇంకో ప్లేటులో వేసి వరలక్ష్మికి ప్లేటు అందించాడు తినమన్నట్లుగా.

భర్తకేసి చూసి మౌనంగా తీసుకుంది వరలక్ష్మి.

ఇద్దరూ ఎవరి ఆలోచనల్లో వాళ్లుండిపోయారు.

పూజని ఆయనకు అందించి కాఫీ కలుపుకు వచ్చింది ఆవిడ. కాస్త వేడి కాఫీ తాగేటప్పటికి పోయిన ప్రాణం తిరిగి వచ్చినట్టు అనిపించింది ఆవిడకు.

"వరం! నీకీ మధ్య పని చాలా ఎక్కువయిందే"

"చాల్లెండి. ఎవరైనా వింటే నవ్వేపోతారు. మన పిల్లలకి చేసుకోవడం కూడా ఓ పనేనా?"

"మన పిల్లలయినా ఎంతవరకు? నీకూ వయుస్సు పెరుగుతోందికానీ..."

ఆయన మాటలకు అడ్డొస్తూ-

"ఓపిక వున్నంతవరకు. పాపం ఇద్దరికి ఉద్యోగాలాయె? తెల్లారితే ఉరుకులు పరుగులు. ఎప్పుడో రాత్రికి వేళ్లాడుతూ వస్తారు. అప్పటికీ వంటంతా భారతే చేస్తోందీ మధ్య"

"అవునవును. నువ్వు బియ్యం కడిగి పెడితే కుక్కర్లో పెడుతుంది. కూరలు తరిగి రెడీగా ఉంచితే తిరగమాత వేస్తుంది. ఇడ్లీ పిండి మెత్తగా రుబ్బి పెడితే ఇడ్లీలు తయారు చేస్తుంది. అంత పనీ భారతే చేస్తోంది" రంగారావు ఎక్కసంగా అన్నాడు.

"అయ్యో... ఇడ్లీ అంటే గుర్తుకొచ్చింది. పూజకి అన్నం మెత్తగా విడిగా పడేయాలి" అంటూ వంటింట్లోకి వెళ్లింది.

జాలిగా చూసాడాయన వెళుతున్న ఆవిడ వంక. చంటిదానికి స్నానం చేయించి పడుకోబెట్టేటప్పటికి ఒంటిగంటయింది. రంగారావు నెమ్మదిగా లేచి టేబుల్ మీద కంచాలు పెట్టాడు. ఇద్దరు కలసి భోజనాలు చేసారు. వంటిల్లు సర్ది పడుకుందామని ఇలా పక్కమీదకు ఒరిగిందోలేదో పూజ ఏడుస్తూ లేచింది.

పాలు కలిపి పట్టించి కాసేపు ఆడించింది ఆవిడ. మూడున్నర అవుతుండగా హర్ష వచ్చే సాడు. వాడికి అన్నం పెట్టి ట్యూషన్‌కు పంపించింది. నాలుగు దాటుతుండగా రంగారావు నిద్రలే

చాడు. ఆయనతోపాటు టీ తాగింది. పనిమనిషికి అంట్లు వేసి ఆరేసిన బట్టలు మడతపెట్టి ముఖం కడుక్కుని బట్టలు మార్చుకుని చంటిదాన్ని తయారుచేసింది వరలక్ష్మి. చీకటి పడేటప్పటికి రవి, భారతి ఇద్దరూ వచ్చేసారు. భారతి కాఫీ తాగుతూ, ఓపక్క అన్నం, మరోపక్క కూర వడేసింది.

రంగారావు "వరం! రా అలా వాకింగ్‌కు వెళ్లి వద్దాం" అన్నాడు.

"అబ్బా...ఇప్పుడా? రాలేను. అయినా చీకటి పడిందిగా"

"అయిదింటికి వెళ్దాం అంటే వీళ్లు వచ్చాక వెళదాం అంటావు. ఏదో వంక పెడతావు" విసుక్కున్నాడాయన. ఆ విసుగులో నీ ఆరోగ్యం కోసం కూడా అన్న ధ్వని అర్థం చేసుకున్న వరలక్ష్మి "సరే పదండి" చెప్పులు వేసుకుని వచ్చింది.

వాళ్ళు వెళ్లాక-

"మీ నాన్నగారికి అత్తయ్యగారంటే ఎంత ప్రేమో చూడండి" అంది భారతి.

"ఏం నాకు లేదా నువ్వంటే?" రవి కొంటెగా అన్నాడు.

చిన్నగా నవ్వేసింది.

"అది కాదండీ. మీ అమ్మగారు ఇంట్లో పనివల్ల చాలా కష్టపడుతున్నారన్న కొత్త ఫీలింగ్ ఆయనకు తరచుగా వస్తోంది"


"అమ్మకా? పనా? వంటకి నువ్వున్నావు? అంట్లకి, బట్టలకి అన్నింటికీ పనివాళ్లని పెట్టాము. ఇంకా ఏం పని?" రవి ఆశ్చర్యంగా అన్నాడు.

"పూజ పని"

"అదేమిటి పూజలాంటి ఏడిపించని పిల్లల్ని వందమందినైనా పెంచవచ్చని అమ్మ ఎన్నిసార్లు అంటుందో కదా. అయినా హాయిగా కబుర్లు చెప్పుకుంటూ ఇద్దరు కాలక్షేపం చేస్తూ పూజని చూడవచ్చుగా"

"ఏమో? మనకేమాత్రం సాయం చేయకుండా ఆవిడ ఎప్పుడూ ఆయన పక్కగానే ఉండాలన్న కోరిక ఉందేమో"

"నిజానికి అమ్మకి నాన్నగారి పనే ఎక్కువ. అమ్మ ముందునుంచీ అలాగే అలవాటు చేసింది అన్నీ దగ్గరుండి అమర్చి పెట్టడం!"




"కొంపదీసి నేనలాలేనని ఏమైనా మీలో కొత్త ఫీలింగ్స్ పుడుతున్నాయా ఏమిటి?" భారతి హాస్యంగా అంది.

"నో భారతీ... ఐ డోంట్ లైకిట్. నేను ముందునుంచీ నా పనులన్నీ నేనే చేసుకునేవాడిని. డిసిప్లీన్ అంటే నాకిష్టం. ఇంట్లో అందరూ కష్టపడాలి అంతేగానీ ఏ ఒక్కరో కాదు. అలాగే పెరిగాను. చెల్లెలు, తమ్ముడు కూడా అదే ఫాలో అయ్యారు. అందరం చక్కగా సెటిలయ్యాం"

"ఎలాగైనా పూజవల్లే ఇబ్బంది పడుతున్నారు వాళ్ళు"

"పూజ స్కూలుకి వెళ్లేవరకూ మనకూ ప్రాబ్లం అండీ" భారతి అంది.

"ఛ... అలా అనకు భారతీ. చూద్దాంలే కాకపోతే క్రెష్‌లు ఉన్నాయిగా" తీసి పారేసాడు రవి.

"అంతవరకూ వస్తే ఎలాగూ తప్పదు" నిట్టూర్చింది భారతి.

***

"తప్పదు వరం" నెమ్మదిగా అన్నాడు రంగారావు పార్కులో వరలక్ష్మితో నడుస్తూ.

"వరం! ఇంట్లో పరిస్థితి చూస్తూనే వున్నావు. నేను రవిని, భారతిని తప్పు పట్టడంలేదు. ఇప్పటితరంలో అందరూ అలాగే పరుగులు పెడుతున్నారు. ఏదో సుఖాలకోసం ఆరాటపడుతున్నారు. అయినా అది వాళ్లిష్టం. వాళ్ల సుఖం కోసం మిగిలిన మన కొద్ది జీవితం బలి పెట్టుకోవడం మటుకు అవివేకం. ఇంకె న్నాళ్లు బతుకుతామో తెలియదు.


## లాభనష్టం మెలిక

ఆర్థర్‌ంగ్ రాబిన్‌సన్ అనే 91ఏళ్ళ బ్రిటీష్ అతను తను ఏడాదిలోగా చనిపోతానని ఎవరితోనో 500 పౌండ్లకి పందెం కాశాడు. అతను చావలేదు కనుక 500 పౌండ్లు నష్టపోయాడు. కానీ అతని కనుక చనిపోయి ఉంటే భార్యకి అతని ఆస్తి సంక్రమించినందుకు ప్రభుత్వానికి వారసత్వపు టాక్స్ 3000 పౌండ్లు చెల్లించాల్సి వచ్చేది. అది తప్పినందుకు తనకు లాభమే కలిగిందని అతను మురిసిపోయాడు. ఏది లాభం? ఏది నష్టం? అంతా అనుకోవడంలోనే ఉంది కదా!

## పై కోర్టు తీర్పు

ఇటలీలో కుటుంబ ఆస్తుల లావాదేవీల్లో కోర్టులో భార్య తనకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పిందని ఫ్రానెస్కో ఆమెతో ఏడేళ్లపాటు సంసారం చేయలేదు. భర్త తన కోరిక తీర్చక వేధించాడని భార్య పీరా విడాకులకని కోర్టుకెక్కింది. చివరకి 2000లో ఇద్దరూ విడిపోయారు. కానీ ఇంత చిన్న దానికి భార్య భర్తని విడిచిపోరాదని వాళ్లిద్దరూ కలిసి ఉండాల్సిందేనని పై కోర్టు తీర్పుచెప్పింది.

-తటవర్తి




ఈ కొద్దిరోజులు, నా వల్లలో నువ్వు, నా ఆలోచనల్లో నేను గడపడం మటుకు అవసరం. నిదానంగా ఆలోచించు. భగవద్గీతలో శ్లోకం వివరించి నీకు చెబుదామనుకుంటాను. పూజకు నీళ్లు పోస్తూ వుంటావు. ఉప్మా వేడిగా తినాలని వుంటుంది ఇద్దరికి. చల్లారింది బాధపడుతూ తింటాం చివరికి. పొద్దునే లేవలేను అంటావు. పాలవాడి కేకకి నీకే మెలకువ వస్తుంది. నువ్వే లేస్తావు.

ఇలా చెబుతుంటే ఎన్నో ఉదాహరణలు మన జీవితాల్లో. మన పిల్లల్ని అప్పులు చేసి చదివించి అష్టకష్టాలు పడి ప్రయోజకుల్ని చేసి అన్ని రుణాలు తీర్చుకుని ఇప్పుడే ఒడ్డున పడ్డాం. పిల్లల చదువులు పాడయిపోతాయని నువ్వోచోట నేనోచోట... ఇలా ఇద్దరం ఎన్నో ఏళ్ళు విడిగానే బతికాం. ఇప్పుడు దగ్గరగా ఉన్నామన్న తృప్తి, మనం రోజురోజుకూ పెంచుకుంటున్న అనుబంధాలతో ఆవిరైపోతోంది" రంగారావు ఆగాడు.

వరలక్ష్మి భర్త వంక బేలగా చూసింది.

"ఇది తప్పు కదా?" అంది హీనస్వరంతో.

"ఏమాత్రం కాదు. మన శేషజీవితం ప్రశాంతంగా గడపాలని కోరుకోవడం నేరం కాదు"

"మరి సమాజం, రవివాళ్ళు ఎంత బాధపడతారో?"

"ఎవరేమనుకున్నా నేను లెక్కచేయను వరం. ఏలూరులో పనిచేసేట ప్పుడు సదాశివం, నా స్నేహితుడు అదే ఆశ్రమంలో చేరాడుట. ఎంతో హాయిగా ఉందిట అక్కడ. నెలకు రెండువేలు కడితే ఒక పూట భోజనం, మరో పూట టిఫిన్, పూజామందిరం, చక్కటి తోటలు... అన్నీ సౌకర్యంగా ఉన్నాయిట. డాక్టర్లు వారంవారం పరీక్షించి వెళతారు. ఇంక ఎలాంటి సందేహాలు పెట్టుకోకు. మనం సంసారంలో కూరుకుపోయి పోగొట్టుకున్న ఆనందాలన్నీ ఆధ్యాత్మిక చింతనలో కలిసి అనుభవిద్దాం"

"సరే" వరలక్ష్మి గొంతు వణికింది.

***

నిన్న సాయంత్రం తాను తీసుకున్న నిర్ణయాన్ని కొడుక్కి చెప్పారాయన.

తండ్రి చెప్పిన విషయం విని క్షణంపాటు నిర్ఘాంతపోయాడు రవి.

"ఏమిటి నాన్నగారూ! ఇంత హఠాత్తుగా" రవి గొంతులో బాధ ధ్వనించింది.

"ఒరేయ్ రవి! నువ్వు బాగా చూడడంలేదనో, మాకిక్కడ బాగాలేదనో వెళ్లడంలేదు. మా శేష జీవితాలు ప్రశాంతంగా గడపాలన్న కోరికతో వెళ్లిపోతున్నాము. మమ్మల్ని ఆపవద్దు. అలాగే మీరెప్పుడు మమ్మల్ని చూడాలనుకున్నా వెంటనే వచ్చేయండి. ఒకవేళ మీకు వీలు కాకపోతే ఎప్పుడో మేమే కనిపిస్తాం" రంగారావు నిబ్బరంగా అన్నాడు.

ట్రైన్‌లో వెళ్లిపోతుంటే వరలక్ష్మి భోరుమని ఏడ్చేసింది అందరినీ వదల్లేక.

"డబ్బుందనీ, పెన్షన్ వస్తుందనీ మీ నాన్నగారికి అహం. అందుకే సులువుగా తెంపుకుని వెళ్లిపోయారు" కోపంగా, బాధగా అంది భారతి ఇంటికి తిరిగి వస్తుంటే.

"లేదు భారతీ! ఒకరకంగా ఆయన భావాలూ కరెక్టేనేమో!"

"చాల్లెండి. అందరూ ఏమనుకుంటారు? అయినా ఒకళ్ళు జారిపోతే అప్పుడు గుర్తుకువస్తాంలెండి మనం తప్పకుండా"

"భారతీ! ఆ పరిస్థితిని ఎదుర్కోవడానికే వాళ్లకీ ప్రయాణం. ఆ మనోనిబ్బరం పెంచుకోవడానికి ఈ ఆశ్రమ జీవితం వాళ్లకు ఓ సాధనం. అయినా ఆలోచిస్తూ ఉంటే మనం కూడా ఇంకో పాతికేళ్ల తరువాత ఇదే మార్గం పట్టక తప్పదేమో! ఇదో వానప్రస్థం" రవి స్కూటర్ నడుపుతూ సాలోచనగా అన్నాడు.

★